క్లుప్తంగా

టెన్త్ విద్యార్థులకు ఉచిత శిక్షణ తరగతులు

ఎచ్చెర్ల క్యాంపస్: పదో తరగతి విద్యార్థులకు ఇంగ్లీషు, గణితం, సైన్స్ సబ్జెక్టుల్లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు కేఎస్‌పీ విద్యా, సంక్షేమ సంఘం ప్రతినిధి కిల్లి అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. మే 1 నుంచి 31 వరకు ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ కళాశాల వెనుక ఉన్న భవనంలో శిక్షణ ఉంటుందని, పూర్తి వివరాలకు 94407 51318 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

సీసీ రోడ్డు ప్రారంభం



రోడ్డు ప్రారంభిస్తున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేట పంచాయతీ ఉషోదయ కాలనీలో ఆర్థిక సంఘం నిధులు రూ.16 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఎంపీపీ మొదలవలస చిరంజీవి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సంఘం, ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపొనెంట్లతో పూర్తి స్థాయిలో రోడ్లు, కాలువల నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తకోట పూర్ణచంద్రరావు, విప్ బగ్గు రాజారావు, నాయకులు బొడ్డేపల్లి సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీకి మాజీ సైనికుల వినతి



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడును మాజీ సైనిక ఉద్యోగులు ఆదివారం ఆయన నివాసంలో కలిశారు. ఢిల్లీలో మాజీ సైనికులు శాంతియుతంగా చేస్తున్న ధర్నాకు మద్దతు తెలియజేయాలని కోరినట్లు జిల్లా మాజీ సైనికుల సమాఖ్య అధ్యక్షుడు పూర్ణచంద్రరావు తెలిపారు. వన్ ర్యాంక్ వన్ పెన్షన్–2 లోని సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని విన్నవించారు. కార్యక్రమంలో జిల్లా మాజీ సైనికుల సమాఖ్య చైర్మన్ కెప్టెన్ ఈశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు బి.సంజీవరావు, జనరల్ సెక్రటరీ రామారావు, మహిళా సెక్రటరీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినికి అభినందనలు



ధనలక్ష్మిని మిఠాయి తినిపిస్తున్న ప్రిన్సిపాల్ హైమావతి

రణస్థలం: మండలంలోని లంకపేట కేజీబీవీలో చదువుతున్న నిద్రబంగీ ధనలక్ష్మి ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ సెకెండియర్ ఫలితాల్లో ఎంపీసీలో 925 మార్కులు సాధించింది. నారువ గ్రామానికి చెందిన తల్లిదండ్రులు లక్ష్మి, అసిరయ్యలు నిరుపేద కుటుంబానికి చెందినవారు. ధనలక్ష్మి పట్టుదలతో చదివి మొదటి స్థానంలో నిలవడం పట్ల ప్రిన్సిపాల్ ఎస్.హైమావతి ఆదివారం అభినందించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

భూమిని బాగు చేసుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ఎచ్చెర్ల: ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికను పాటించి రైతులు తమ భూములను బాగు చేసుకోవాలని ప్రకృతి వ్యవసాయం సబ్ డివిజన్ యాంకర్ పర్సన్ సీహెచ్ సూర్యనారాయణ సూచించారు. ఆదివారం ముద్దాడలో ఇంటింటా ప్రచారం చేపట్టి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాల ప్రాధాన్యత, భూమిని బాగు చేసుకునే పద్ధతులను వివరించారు. ఒకే చోట 20 రకాల పంటలను వేసుకోవడం వల్ల భూమిలో తేమ శాతం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి సీహెచ్ నాగమణి, ఐసీఆర్‌పీలు సాధు వెంకటలక్ష్మీ, పి.ధనలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

రణస్థలం: 2016కు ముందు ఆధార్ కార్డు పొందిన ప్రతిఒక్కరూ ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని ఎంపీడీఓ వి.ధనుంజయరావు సూచించారు. అర్జునవలస, పిసిని, పైడిభీమవరం, జె.ఆర్.పురం, కోటపాలెం, తెప్పలవలస గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలు సోమవారం ప్రారంభమౌతున్నాయని, సరైన ధ్రువీకరణ పత్రాలతో అప్‌డేట్ చేసుకోవాలని కోరారు.

వెంకన్న కల్యాణోత్సవాలు ప్రారంభం

- నేత్రపర్వంగా శ్రీవారికి క్షీరాభిషేకాలు
- నారాయణ తిరుమలలో ఆధ్యాత్మిక శోభ



ధ్వజ స్తంభం వద్ద గరుడ జెండాను ఎగురవేస్తున్న అర్చకులు



స్వామివారికి క్షీరాభిషేకం

శ్రీకాకుళం కల్చరల్: ఉత్తరాంధ్ర తిరుమలగా పేరుగాంచిన పీఎన్ కాలనీలో నారాయణ తిరుమలలో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో గరుడ జెండాను ధ్వజ స్తంభం వద్ద ఉంచి పూజలు నిర్వహించి కల్యాణ ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ముందుగా శ్రీవారి విశ్వరూప దర్శనం, క్షీరాభిషేకాలు జరిగాయి. సాయంత్రం శ్రీవిష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, ఉత్సవ సంకల్పం, ఆచార్య రుత్విగ్వరణ రక్షాబంధనలు నిర్వహించారు. మత్సంగ్రహణం, యాగశాల ప్రవేశం, అంకురారోపణ, వాస్తు, యోగేశ్వర, నవబ్రహ్మ, గరుడ, మండపారాధనలు, భేరి పూజ, పతాక స్థాపన, అగ్ని ప్రతిష్ట, ఆరాధనలు జరిగాయి.

ఘనంగా క్షీరాభిషేకాలు..

స్వామి వారి నిజరూప దర్శనం చేసుకుని భక్తులు పారవశ్యం చెందారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి నిజరూపాన్ని కనులారా వీక్షించి గోవింద నామస్మరణతో నిమగ్నమయ్యారు. పాలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. సంప్రదాయ పూజల అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ జరిగింది. కల్యాణోత్సవాలలో సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు పలువురు భక్తులు గోవింద మాలధారణలు చేశారు.

శ్రీశ్రీ రచనలు సమాజానికి మేలుకొలుపులు



పుస్తకావిష్కరణ చేస్తున్న అతిథులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీశ్రీ రచనలు సమాజానికి మేలుకొలుపులని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. నగరంలోని ఒక ప్రైవేటు హోటల్‌లో అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో మహాకవి శ్రీశ్రీ జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి డాక్టర్ హనుమంతు లజపతిరాయ్ మాట్లాడుతూ శ్రీశ్రీ సినీ సాహిత్యం, విప్లవ సాహిత్యంపై ప్రసంగించారు. గరిమెళ్ల విజ్ఞాన వేదిక అధ్యక్షుడు వి.జి.కె.మూర్తి మాట్లాడుతూ నేటి సామాజిక పరిస్థితులకు అనుగుణంగా రచయితలు రచనలు కొనసాగించాలని కోరారు. అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నల్లి ధర్మారావు మాట్లాడుతూ సమాజ అధ్యయనం ద్వారా మంచి సందేశాన్ని అందించవచ్చన్నారు. ప్రభుత్వ మహిళా కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ జ్యోతి ఫ్రెడ్రిక్, సీతంపేట డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ జీవన జ్యోతి, పాతపట్నం డిగ్రీకాలేజీ ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు, వంశధార డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్ బాబు, ప్రముఖ రచయిత పత్తి సుమతిలు మాట్లాడుతూ శ్రీశ్రీ భావాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం పత్తి సుమతి రచించిన 'నా కోడి– నా కుంపటి' పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో గురుగుబెల్లి లోకనాథం, తెరవే సభ్యులు ఉపేంద్రశర్మ, చింతాడ కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.25 వేలు విరాళం



విరాళం అందిస్తున్న దాత

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి నదీ తీరంలోని బాలా త్రిపుర కాలభైరవ దేవాలయంలో నిత్యాన్నదానానికి డబ్బీరు శ్రీనివాసరావు(గ్యాస్ వాసు) ఆదివారం రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉమాకవికి కవిశ్రేష్టా బిరుదు



సత్కారం అందుకుంటున్న ఉమాకవి

శ్రీకాకుళం కల్చరల్: హైదరాబాద్‌కు చెందిన ఎస్.వి.ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలుగు వెలుగు సాహిత్య జాతీయ వేదిక నేతృత్వంలో జాతీయ సంబరాలలో భాగంగా ఆదివారం శ్రీకాకుళం నగరానికి చెందిన ఉమాకవికి కవిశ్రేష్టా బిరుదుతో సత్కరించారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డు ధ్రువపత్రాన్ని ప్రదానం చేశారు. కార్యక్రమంలో తానా సాహిత్య వేదిక అధ్యక్షుడు చిగురుమల్ల శ్రీనివాసరావు, మోటూరి నారాయణరావు, పి.ఎస్.ఎన్.మూర్తి, కీలపర్తి దాలినాయుడు, మీసాల గౌరినాయుడు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర ఆరాధనోత్సవం



శ్రీకాకుళం కల్చరల్: ఆరాధిస్తున్న భక్తులు



జి.సిగడాం: పూజలు చేస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: గుజరాతిపేటలోని శ్రీవిరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో ఆదివారం 330వ ఆరాధనా మహోత్సవం ఘనంగా జరిగింది. అర్చకుడు మంత్రిరావు సంతోష్‌కుమార్ శర్మ నేతృత్వంలో బ్రహ్మం సమాధి ఏర్పాటు చేసి జ్యోతి ప్రజ్వలన, జేజినాయన సజీవ సమాధి పొందిన కాలంలో ద్వాదశాక్షరి మంత్రపఠనం నిర్వహించారు. ఉత్సవ మూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మఠం నిర్మాణ భక్త మండలి కమిటీ ప్రతినిధులు పొన్నాడ రమణమూర్తి, గాడి గణపతి ఆచారి, నల్లబాటి కృష్ణమూర్తి ఆచారి తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాం: జి.సిగడాం–పొందూరు మండలాల విశ్వబ్రహ్మణులు ఆదివారం కంచికామాక్షి అమ్మవారి ఆలయంలో పోతులూరి వీరబ్రహ్మం ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వేదపండితులు గన్నవరపు నాగుస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక వ్రతాలు చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ముందూరు కోటేశ్వరావు, కమిటీ సభ్యులు, కొండపల్లి సూర్యనారాయణ, తాళాబత్తుల శ్రీను, జరజాబు సూరిబాబు, తామాడ శివ, కాకినాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుపై సర్వే



అర్జునవలసలో సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

రణస్థలం: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయంపై గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సిటిజన్ ఔట్ రీచ్ సర్వే చేయిస్తున్నామని ఎంపీడీఓ ధనుంజయరావు తెలిపారు. అర్జునవలస గ్రామ సచివాలయ పరిధిలో సిటీజన్ ఔట్ రీచ్ సర్వే చేపట్టారు. పథకాల అమలుపై ఆరా తీశారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు.


వెంకటాపురంలో వాలీబాల్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న లుకలాపు అప్పలనాయుడు, నాయకులు

లావేరు: యువత క్రీడల్లో రాణించాలని వైఎస్సార్ సీపీ బూత్ కమిటీ మాజీ మండల కన్వీనర్ లుకలాపు అప్పలనాయుడు అన్నారు. వెంకటాపురంలో ఆదివారం లుకలాపు యువసేన ఆధ్వర్యంలో అప్పలనాయుడు సౌజన్యంతో నియోజకవర్గ స్థాయి వాలీబాల్ లీగ్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో లావేరు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మీసాల అప్పారావు, సర్పంచ్‌లు శాంతాటి భాస్కరరావు, బొంతు ఎల్లంనాయుడు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు వట్టి సత్యనారాయణ, లావేరు హైస్కూల్ పీఎంసీ చైర్మన్ లంకలపల్లి మల్లేశ్వరరావు మాజీ సర్పంచ్‌లు వాళ్లే దాలినాయుడు, శివాంగం నాగరాజు, గొర్లె రామినాయుడు, ఉప సర్పంచ్ బొబ్బాది గోవిందరావు, వార్డు మెంబరు ఇప్పిలి కృష్ణ, నాయకులు వాళ్లే పెదదాలినాయుడు, తేనేల సురేష్‌కుమార్, మీసాల త్రినాథరావు, జగ్గురోతు రాము, మీసాల నారాయణరావు, పతివాడ గురునాయుడు, నెల్లి బలరాం, పిన్నింటి సూర్యారావు, వావిళ్ల తమ్మినాయుడు, శంబాన సూర్యారావు, భూటు నర్సింహులు, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నూతన లయన్స్ క్లబ్ ఆవిర్భావం



మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకసుళం (పి.ఎన్.కాలనీ): లయన్స్ క్లబ్ సేవలను విస్తృతం చేయాల్సిన అవసరం ఉందని కె.ఎన్.సి.వి.ప్రసాద్ (హారిక ప్రసాద్) అన్నారు. నగరంలో నూతనంగా లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీకాకుళం హర్షవల్లి క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ లయన్స్ క్లబ్ ఆశయాల సాధనకు మరిన్ని క్లబ్బులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చింతాడ కృష్ణమోహన్, డాక్టర్ సత్యస్వరూప్ రావన్, ఎన్.గిరిబాబు, న్యాయవాది జి.ఎస్.కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని కాపాడుకుందాం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):



మాట్లాడుతున్న భారత్ బచావో కమిటీ చైర్మన్ భాస్కరరావు

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మత విశ్వాసాలను రెచ్చగొడుతోందని, ఆ పార్టీ నుంచి దేశాన్ని రక్షించుకుందామని భారత్ బచావో ఆంధ్రప్రదేశ్ కమిటీ చైర్మన్ సి.భాస్కరరావు అన్నారు. జిల్లా భారత్ బచావో సన్నాహక కమిటీ సమావేశం ఇలిసిపురంలోని అంబేడ్కర్ విజ్ఞాన మందిరంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో లౌకిక ప్రజాస్వామ్య శక్తులు, వామపక్ష భావజాలం గల ప్రజా సంఘాలు, పార్టీలు ఏకమై బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. అనంతరం సన్నాహక కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా పేడాడ పరమేశ్వరరావు, సభ్యులుగా కె.వి.జగన్నాథరావు, పిట్టా చంద్రపతి, బత్తిన హేమారావు, మిస్క కృష్ణయ్య, చౌదరి లక్ష్మణరావు, నాగభూషణం, పార్వతీశం మాస్టారు, కె.ధర్మారావులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బొడ్డేపల్లి మోహన్‌రావు, నేతల అప్పారావు, డి.గణేష్, సయ్యద్ బేగ్, మహ్మద్ అమీర్, మహమ్మద్ సాను, జలీల్, మిస్క కృష్ణయ్య, బెలమర ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాల వికాస్ సంబరాలు



నృత్యాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో జిల్లా సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి బాలవికాస్ సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి సంస్థలు చేస్తున్న సేవల్లో అత్యంత ప్రధానమైనది విద్య విభాగమన్నారు. చదువుతో పాటు దైవభక్తి, ఇతర అంశాలు ప్రదర్శించడం గొప్పవిషయమన్నారు. జిల్లా అధ్యక్షుడు ఎన్ని లింగరాజు మాట్లాడుతూ జిల్లాలోని సత్య సాయి సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్ని బాలవికాస్ కేంద్రాల నుంచి చిన్నారులు పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ప్రదర్శించిన నృత్యాలు, నృత్య రూపకాలు, క్విజ్ పోటీలు, ఆటల పోటీలు, బుర్ర కథ, యోగా, వేద పఠనం తదితర కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.సురేంద్ర, రాష్ట్ర విద్యావిభాగం సమన్వయకర్త ప్రొఫెసర్ వి.శంకుంతల, రాష్ట్ర ఐ.టి.ఇన్‌చార్జి ఆర్.కిషోర్, గ్రామసేవా ఇన్‌చార్జి సత్యనారాయణ, విద్యాజ్యోతి ఇన్‌చార్జి ఎస్.ఎస్.వి గురుప్రసాద్, యువజన సహ సమన్వయకర్త వి.కల్యాణి, గంగుల రమణ బాబు, కిల్లాన ఫల్గుణరావు తదితరులు పాల్గొన్నారు.

మన్ కీ బాత్‌తో ఏకతాటిపైకి ప్రజానీకం



ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న బీజేపీ శ్రేణులు

శ్రీకాకుళం న్యూకాలనీ: మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా ప్రధాని మోదీ దేశ ప్రజానీకాన్ని ఏకతాటిపైకి తీసుకొచ్చారని వక్తలు కొనియాడారు. ఆదివారం జరిగిన మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్ లైవ్ కార్యక్రమాన్ని బీజేపీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు వీక్షించారు. బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి పూడి బాలాదిత్య ఆధ్వర్యంలో గురజాడ ఎడ్యుకేషనల్ సొసైటీ మునసబుపేటలో 140 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, బీబీఏ విద్యార్థులతో కలిసి ప్రత్యక్ష ప్రసారం వీక్షించారు. కార్యక్రమంలో గురజాడ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ జి.వి.స్వామినాయుడు, ప్రిన్సిపాల్ రంగారావు, ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ వంగా మహేష్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం నేతృత్వంలో పీఎన్‌కాలనీలోని క్యాంపు కార్యాలయం వద్ద పార్టీ కార్యకర్తలు, శ్రేణులు, స్థానిక యువతతో కలిసి మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గంలో 207 పోలింగ్ బూత్ వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు మోడీ లైవ్ కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమంలో పార్టీ శ్రీకాకుళం అసెంబ్లీ ఇన్‌చార్జ్ చల్లా వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి గంగు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



మాట్లాడుతున్న లైబ్రేరియన్ ఉగ్రసేన

శ్రీకాకుళం అర్బన్: చిన్నారులు వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేయకుండా గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలు, పత్రికలు చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని లైబ్రేరియన్ పి.ఉగ్రసేన అన్నారు. నగరంలోని బలగ శాఖా గ్రంథాలయంలో జూన్ 16 వరకు జరగనున్న వేసవి శిక్షణ శిబిరాలను ఆదివారం ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలలో చిన్నారుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలను గ్రంథాలయాలకు పంపించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీహెచ్.మంగమ్మ, పి.వసంతరావు, ఎస్.బాలకృష్ణ, ఆర్.అన్నాజీరావు, పి.శ్రీనివాసరావు, ఎ.రజినీకాంత్‌రావు, సహాయకురాలు కె.అనిత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ బోధన



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం రమేష్

జి.సిగడాం: ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ బోధన అందుతోందని, పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలని చంద్రయ్యపేట ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం పేకల రమేష్ కోరారు. ఆదివారం పాఠశాల ఆవరణలో తల్లిదండ్రుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగం అభివృద్ధికి అనేక పథకాలు, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లా లక్ష్మిభవాని, ఉపాధ్యాయులు మక్క గంగేశ్వరి, ఉరిటి సతీష్ పట్నాయక్, వల్లూరు రమణ, కోటేశ్వరరావు, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

భర్త కనిపించడం లేదని భార్య ఫిర్యాదు



పేకాన కృష్ణ

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని హడ్కో కాలనీకి చెందిన ఓ వివాహిత తన భర్త కనిపించడం లేదని ఫిర్యాదు చేసినట్లు రెండో పట్టణ సీఐ పప్పల శ్రీనివాస్ తెలిపారు. సంవత్సరం క్రితం సంతకవిటి మండలం వాసుదేవరపట్నం గ్రామానికి చెందిన పేకాన కృష్ణకు భవానితో వివాహమైంది. భవాని శ్రీకాకుళం ఓ డెంటల్ ఆస్పత్రిలో పనిచేస్తోంది. కృష్ణ ఎలక్ట్రికల్ స్కూటీ షోరూంలో పనిచేస్తున్నాడు. ఈనెల 26న డ్యూటీకని వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసినా ఫలితం లేకపోయిందని భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

గ్రంథాలయాల్లో 'చదవడం మాకిష్టం'



లావేరు: మురపాక గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు



ఎచ్చెర్ల: ధర్మవరం లైబ్రరీలో కథలు చెబుతున్న విద్యార్థులు

లావేరు: పుస్తకాలను చదివితే విజ్ఞానం లభిస్తుందని లావేరు, మురపాక శాఖా గ్రంథాలయాలధికారి ఎం.శ్రీనివాసరావు అన్నారు. గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు టీవీ, సెల్‌ఫోన్ల వాడకం తగ్గించి పుస్తకాలు చదివితే ఎన్నో విషయాలు తెలుస్తాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు ఎ.గడ్డెయ్య, పి.షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: పుస్తకాలు చదివితే మనసు ఆనందంగా ఉంటుందని గ్రంథాలయాధికారి ఎం.చంద్రశేఖరరావు అన్నారు. ధర్మవరం శాఖా గ్రంథాలయంలో చదవటం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కథలు చెప్పించారు. విజేతలుగా నిలిచిన జి.లాస్య, జి.శరత్, జి.లక్ష్మణరావులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు



నగరంలోని చిన్న బజారు వద్ద వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలు ఘనంగా ఆదివారం నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. – శ్రీకాకుళం కల్చరల్